వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, ఆగస్టు 10, 2026

# రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి

- నాగార్జునసాగర్‌లో మహా వరుణయాగం
- నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు



**నాగార్జునసాగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహా వరుణయాగం వైదిక క్రతువులు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహారం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ పవిత్ర వరుణ యాగంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని, రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. వైదిక క్రతువు: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో వరుణదేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ ఈ హోమక్రతువులు నిర్వహించారు. ఈ పవిత్ర యాగంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో కారణంగా ఈసారి రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని తలపెట్టింది. “రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి. భూగర్భ జలాలు పెరిగి, పంటలు పుష్కలంగా పండి రైతుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే” వరుణ దేవుడిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ముందుకు వెళ్తూనే.. ప్రకృతి అనుగ్రహం కోసం మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు, పి.సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# నిమ్మపల్లి ప్రాజెక్టును, వట్టిమల్లలో తెగిన రహదారిని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వట్టిమల్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మూలవాగు, తెగిపోయిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే రహదారికి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన నిమ్మపల్లి ప్రాజెక్టును సందర్శించి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్లకు టీఆర్‌టీయూ మద్దతు

- 12న ఇందిరా పార్క్ వద్ద టీఆర్‌టీయూ మహా ధర్నా
- పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆటోడ్రైవర్ల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ (టీఆర్‌టీయూ) సమరభేరి మోగించింది. ఆటోడ్రైవర్లకు మద్దతుగా ఈనెల 12న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ మహాధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రకటించింది. ఈ మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు ఆవిష్కరించారు. ‘లాస్ట్ మైల్ కనెక్టివిటీ’ పేరుతో ఆటోడ్రైవర్ల పొట్టకొట్టేలా రేవంత్ సర్కార్ తీసుకున్న ప్రజా, కార్మిక వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ ధర్నాకు పిలుపునిచ్చినట్లు టీఆర్‌టీయూ నాయకులు ఎల్. రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్ స్పష్టం చేశారు. ఆటోడ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధికి గండి: ఫ్రీ బస్ పథకం వల్ల ఆటోడ్రైవర్ల ఉపాధికి ఇప్పటికే గండి పడిందని, ప్రభుత్వం ఇస్తామన్న ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అమలు చేయకపోవడంతో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని రూప్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఆటో యూనియన్లతోనూ సంప్రదింపులు జరపకుండా ‘లాస్ట్ మైల్ కనెక్టివిటీ’ పేరుతో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్ల జీవితాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆటోడ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని, ఫ్రీ బస్ కారణంగా సుమారు 300 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఇస్మాయిల్ విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.






# 15న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- సంగారెడ్డిలో ముమ్మర ఏర్పాట్లు
- నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈ నెల 15న సంగారెడ్డికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రానున్నారు. సంగారెడ్డి వేదికగా రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అందించనున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అరకొరగానే రేషన్ కార్డులు అందాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించబోతున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

